RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# 24 గంటల్లోనే మిస్సింగ్ బాలిక ఆచూకీ లభ్యం

**- పోలీసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ బృందం కృషికి సీడబ్ల్యూసీ అభినందనలు**




**లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)**
లక్ష్మీదేవిపల్లి మండలం జయశంకర్ కాలనీకి చెందిన ఏడేళ్ల బాలిక ఆచూకీని పోలీసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ బృందం సంయుక్తంగా గుర్తించారు. అక్టోబర్ 8న ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బాలిక తప్పిపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా బాలిక ఆచూకీ కోసం ప్రయత్నించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో-ఆర్డినేటర్ బానోత్ సందీప్, బృంద సభ్యులు భవానీ, భావన, రంజీత్ గాలింపులో పాల్గొన్నారు. మూడో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆదేశాలతో పోలీసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ బృందం చేపట్టిన చర్యలతో గురువారం మధ్యాహ్నం రామవరంలో బాలిక ఆచూకీ లభ్యమైంది. అనంతరం బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ముందు హాజరుపరిచారు. కమిటీ సభ్యులు సబ్బాతి సుమిత్రాదేవి, సాదిక్ పాషా బాలికను ఆమె తండ్రికి అప్పగించారు. తప్పిపోయిన బాలికను త్వరితగతిన గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చిన పోలీసులను, చైల్డ్ హెల్ప్‌లైన్ బృందాన్ని సీడబ్ల్యూసీ సభ్యులు అభినందించారు.

# 16న ప్రకాశం స్టేడియంలో బతుకమ్మ ప్రధాన వేడుకలు, ఫ్యామిలీ డే నిర్వహణ

**మహిళలకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు**

**సింగరేణి జీఎం అజయ్ కుమార్ ఆదేశం**



**కొత్తగూడెం సింగరేణి అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఈ నెల 14న సింగరేణి ప్రధాన కార్యాలయంలో, 16న కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో బతుకమ్మ వేడుకలు, ఫ్యామిలీ డే నిర్వహించనున్నట్లు జీఎం (పర్సనల్, వెల్ఫేర్, సీఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ) కె. అజయ్ కుమార్ తెలిపారు.శుక్రవారం వేడుకల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన ఆయన, కార్యక్రమానికి హాజరయ్యే మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సెక్యూరిటీ, సివిల్, ఎలక్ట్రికల్, ట్రాన్స్‌పోర్ట్, ఫైనాన్స్, పర్సనల్ విభాగాలు సమన్వయంతో పనిచేసి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. వేడుకల్లో పాల్గొనే మహిళలు తీసుకొచ్చిన బతుకమ్మల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు అజయ్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జీఎం(పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ తో పాటు డిజిఎం(ఈఅండ్ ఎం) ట్రాన్స్పోర్ట్ బి. సీతారామ్, డిజిఎం( పర్సనల్) లు బి.శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, ఎస్ ఈ (ఈ అండ్ ఎం) జి. ఉమా మహేశ్వర రావు, డివై.ఎస్.ఈ ( ఈ అండ్ ఎం) ఎ.నరేష్ బాబు, డివై ఫైనాన్స్ మేనేజర్ సి హెచ్ రమేష్, డివై సివిల్ ల్.సరిత, డి వై పి ఎం కె.శివ కుమార్, జూనియర్ ఇన్స్పెక్టర్ డి.నారాయణ రెడ్డి, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద రావు , తదీతరులు పాల్గొన్నారు.

# సింగరేణి హిందూ ఉద్యోగులకు రూ.25 వేల దసరా అడ్వాన్స్

**ఈ నెల 15న ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ..**

**10 వాయిదాల్లో వసూలు**

**కొత్తగూడెం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)**
సింగరేణి సంస్థలో పనిచేస్తున్న హిందూ ఉద్యోగులకు దసరా పండుగ సందర్భంగా రూ.25 వేల పండుగ అడ్వాన్స్ చెల్లించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు పారిశ్రామిక సంబంధాల విభాగం, కార్పొరేట్ సిబ్బంది విభాగం ఈ నెల 9న ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 20న దసరా పండుగను పురస్కరించుకుని అర్హులైన ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో ఈ నెల 15న అడ్వాన్స్ మొత్తాన్ని జమ చేయనున్నారు. గనుల చట్టం కింద సెలవుకు అర్హులైన ఉద్యోగులు, సాధారణ ఉద్యోగులు, బ్యాడ్జీలు, శిక్షణార్థులకు రూ.25,000 చొప్పున చెల్లించనున్నారు. గనుల చట్టం కింద సెలవుకు అర్హత లేని ఇతర తాత్కాలిక కార్మికులకు రూ.12,500 పండుగ అడ్వాన్స్‌గా ఇవ్వనున్నారు. ఉద్యోగులకు చెల్లించే పండుగ అడ్వాన్స్‌ను తిరిగి వారి వేతనాల నుంచి వసూలు చేయనున్నారు. 2026 నవంబర్ నెల వేతనాల నుంచి ప్రారంభించి 10 సమాన నెలవారీ వాయిదాల్లో ఈ మొత్తాన్ని మినహాయించనున్నారు. గత ఏడాది తీసుకున్న పండుగ అడ్వాన్స్‌ను పూర్తిగా చెల్లించని ఉద్యోగులకు, బకాయిలను మినహాయించిన తర్వాత మిగిలిన మొత్తానికే అర్హత ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అడ్వాన్స్ చెల్లించే నెలలోనే పదవీ విరమణ చేయనున్న లేదా వైద్యపరంగా అనర్హులై ఉద్యోగం నుంచి తొలగించబడే ఉద్యోగులకు ఈ అడ్వాన్స్ వర్తించదు. మరోవైపు, పదవీ విరమణకు 10 నెలల కంటే తక్కువ సమయం ఉన్న ఉద్యోగుల నుంచి, పదవీ విరమణ తేదీలోపు మొత్తం బకాయిని వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యం ఆదేశించింది. నిబంధనలను అన్ని గనులు, విభాగాల అధికారులు కచ్చితంగా అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.



# సింగరేణి కొత్తగూడెం ఏరియాలో సమస్యలు పరిష్కరించాలి

**- సివిల్ డీజీఎంకు వినతిపత్రం అందించిన ఐఎన్‌టీయూసీ నేత ఎండీ రజాక్**



**కొత్తగూడెం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)**
సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలోని గౌతంపూర్ వాటర్ ట్యాంక్, జాతీయ రహదారి పక్కన ఉన్న ఫిల్టర్ బెడ్ పరిసరాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సింగరేణి సివిల్ డీజీఎంకు శుక్రవారం యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికులు, స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమస్యల పరిష్కారానికి యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

**పారిశుధ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**
గౌతంపూర్ వాటర్ ట్యాంక్‌ను వెంటనే శుభ్రం చేయించి సున్నం వేయించాలని, ట్యాంకు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించాలని కోరారు. పిచ్చి మొక్కల కారణంగా పాముల సంచారం పెరిగి ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో పరిసరాలను శుభ్రం చేయించాలని విజ్ఞప్తి చేశారు. ట్యాంకు పరిసరాల్లో కొందరు యువకులు గంజాయి వంటి మత్తుపదార్థాలు సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు ఆ ప్రాంతంలో పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

**ఫిల్టర్ బెడ్ వద్ద మౌలిక వసతులు కల్పించాలి**
జాతీయ రహదారి పక్కన ఉన్న ఫిల్టర్ బెడ్ వద్ద తాగునీటి ఛాంబర్‌ను శుభ్రం చేయించి సున్నం వేయించాలని, రాత్రివేళల్లో ఇబ్బందులు తలెత్తకుండా లైటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. ఫిల్టర్ బెడ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న గేటు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. నీటి సరఫరాను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అదనంగా 75 హెచ్‌పీ పంపు మోటార్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దసరా పండుగను పురస్కరించుకుని సమీపంలోని అమ్మవారి ఆలయానికి రంగులు వేయించి పరిసరాలను అందంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి యాజమాన్యం స్పందించాలి కార్మికులు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించి, యుద్ధప్రాతిపదికన పరిష్కార చర్యలు చేపట్టాలని ఎండీ రజాక్ కోరారు. ఈ కార్యక్రమంలో మల్లారం కొమురయ్య, చిట్ కార్యదర్శి జి. మల్లికార్జున్, రామవరం ఇన్‌చార్జి బాను కమల్, అమర్లాల్, దశరథ్, లెనిన్ బాబు, శ్రీపాల్ రెడ్డి, డి. శ్రీనివాస్ తదితర నాయకులు, కార్యకర్తలు, డీఎల్ఆర్ కార్మికులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కమిటీకి ఐఎన్‌టీయూసీ సంపూర్ణ మద్దతు

**- ఎండీ రజాక్ ఆధ్వర్యంలో పాల్గొన్న యూనియన్ నాయకులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు**



**కొత్తగూడెం అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)**
ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ, టీఎంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, సీఐటీయూ కార్మిక సంఘాలతో కూడిన ఐక్య కమిటీకి ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఎన్నికల కార్యక్రమంలో పాల్గొని ఐక్య కమిటీకి సంఘీభావం తెలిపారు. గత పదేళ్లుగా ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరగలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణకు దశలవారీగా చర్యలు చేపడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, హక్కుల సాధనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతించారు. ఆర్టీసీ కార్మికులు ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని నాయకులు తెలిపారు. కార్మికుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, సంక్షేమం, మెరుగైన భవిష్యత్తు లక్ష్యంగా ఐక్య కమిటీకి మద్దతు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ తరఫున వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్‌తో పాటు మండే వీర హనుమంతరావు, జానీ పాషా, జి. గంగాధర్, రంజిత్, మహేష్, జల్లి కిరణ్, గౌస్ పాషా, బాలుబుల కృష్ణ, రాము, సాంబమూర్తి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున డిప్యూటీ మేయర్ లలిత కుమారి, కార్పొరేటర్లు జల్లి శ్రీలక్ష్మి, కె.కె. శ్రీనివాస్, దావూద్, హరిహరన్, రవి రాంబాబు, స్వప్న, వాసు, సీపీఎం కార్పొరేటర్ శ్రావణి పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికుల ఐక్యతే బలమని, వారి హక్కుల సాధన, సంక్షేమమే తమ లక్ష్యమని ఎండీ రజాక్ స్పష్టం చేశారు. ఐక్య కమిటీకి మద్దతు తెలిపిన యూనియన్ నాయకులు, ప్రజాప్రతినిధులకు, సహకరించిన వారందరికీ ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# జీపీ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అమలుకు కృషి




**- జీవో 51 రద్దు కోసం అసెంబ్లీలో ప్రస్తావిస్తా**

**- ఇందిరమ్మ ఇళ్లలో కార్మికులకు ప్రత్యేక కోటా కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా**

**- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**పాల్వంచ అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)**
గ్రామ పంచాయతీల్లో నిరంతరం సేవలందిస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించి తనవంతు కృషి చేస్తానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. పాల్వంచ పట్టణంలోని సీఆర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఏఐటీయూసీ అనుబంధ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ పాల్వంచ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని, జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నట్లు తెలిపారు. కార్మికులకు నష్టం కలిగిస్తున్నట్లు పేర్కొంటున్న జీవో నంబర్ 51 (మల్టీపర్పస్ విధానం) రద్దు అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని చెప్పారు. ఏళ్లుగా కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించకపోవడం విచారకరమని పేర్కొంటూ, ఈ సౌకర్యాలతో పాటు రూ.10 లక్షల బీమా భరోసా, యూనిఫాంలు, శానిటైజర్ కిట్లు అందించేలా సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులతో చర్చిస్తానన్నారు. సొంత ఇళ్లు లేని అర్హులైన గ్రామ పంచాయతీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రత్యేక కోటా కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని కూనంనేని స్పష్టం చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, బికేయంయు జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఎఐటియుసి జిల్లా నాయకులు యూసుఫ్, అన్నారపు వెంకటేశ్వర్లు నిమ్మల రాంబాబు ఇట్టి వెంకట్రావు, యూనియన్ నాయకులు లంబా నాయక్, బాలకృష్ణ, శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీను, లెనిన్, మమత, వినయ్, రామనాథం, రవి, దుర్గా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

**- రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు**



**పాల్వంచ అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)**
ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కుకు అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తమ పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస రావు కోరారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో వినిపించేందుకు ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ ఓట్లతో పాటు తమకు తెలిసిన అర్హులైన పట్టభద్రుల ఓట్ల నమోదుకు కూడా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# సెక్యూరిటీ సిబ్బందికి ముగిసిన ప్రథమ చికిత్స, అగ్నిమాపక శిక్షణ

**- 30 మందికి వారం రోజుల పాటు శిక్షణ.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు**



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)**
సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాల నుంచి వచ్చిన 30 మంది సెక్యూరిటీ సిబ్బందికి నిర్వహించిన 44వ బ్యాచ్ ప్రథమ చికిత్స, అగ్నిమాపక శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. కొత్తగూడెంలోని ఎస్‌అండ్‌పీసీ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఏరియా సెక్యూరిటీ అధికారి, శిక్షణాధికారి ఎం.డి. జాకీర్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యూనిఫాం సిబ్బందికి ప్రథమ చికిత్స, అగ్నిమాపక చర్యలపై పూర్తి అవగాహన అవసరమన్నారు. ఆపద సమయంలో ప్రథమ చికిత్స అందించడం ద్వారా వైద్యుల వద్దకు తీసుకెళ్లేలోపు బాధితుల ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. వారం రోజుల శిక్షణలో భాగంగా సింగరేణి ప్రధాన ఆసుపత్రి, మైన్స్ రెస్క్యూ స్టేషన్, భద్రాద్రి కొత్తగూడెం అగ్నిమాపక కేంద్రం నిపుణులతో వివిధ అంశాలపై శిక్షణ ఇప్పించినట్లు వివరించారు. సెక్యూరిటీ సిబ్బంది వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణ, నీతి, నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయానికి సెక్యూరిటీ సిబ్బంది నిత్యావసర సరుకులను అందజేశారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎన్. మధుసూదన్, జె. వెంకటేష్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ డి. నారాయణరెడ్డి వందన సమర్పణ చేయగా, శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

# బేతంపూడి పాఠశాలలో వైభవంగా బతుకమ్మ సంబరాలు



**టేకులపల్లి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):**
మండలంలోని బేతంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థినులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి పాఠశాలకు తీసుకొచ్చారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ జానపద పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తారాసింగ్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరం విద్యార్థులపై ఉందన్నారు. తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే పండుగలను పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మన ఆచారాలు, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం రీజియన్‌లో ముగిసిన ఆర్టీసీ ఎన్నికల పోలింగ్

**- 1,789 ఓట్లకు గాను 1,727 ఓట్లు నమోదు**

**- ఐఎన్‌టీయూసీ మద్దతుతో సీఐటీయూ, ఎన్ఎంయూ కూటమి గెలుపుపై ఉత్కంఠ**

**కొత్తగూడెం (తెలంగాణ వాణి)**
తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఖమ్మం రీజియన్‌లో ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, ఇల్లందు, భద్రాచలం, మణుగూరు డిపోలతో పాటు ఖమ్మం ఆర్ఎం కార్యాలయంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.ఖమ్మం రీజియన్ పరిధిలో మొత్తం 1,789 మంది ఓటర్లు ఉండగా, 1,727 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరో 45 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. 17 మంది ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. పోలింగ్ ముగియడంతో కౌంటింగ్, ఫలితాలపై కార్మిక సంఘాల్లో ఉత్కంఠ నెలకొంది.

**డిపోల వారీగా పోలింగ్ వివరాలు**
ఖమ్మం ఆర్ఎం కార్యాలయంలో 29 మంది ఓటర్లు ఉండగా, అందరూ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఖమ్మం డిపోలో 422 మంది ఓటర్లకు గాను 411 మంది ప్రత్యక్షంగా ఓటు వేయగా, ఏడుగురు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. నలుగురు గైర్హాజరయ్యారు.
మధిర డిపోలో 188 మంది ఓటర్లకు గాను 186 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇద్దరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. సత్తుపల్లి డిపోలో 295 మంది ఓటర్లకు గాను 284 మంది ప్రత్యక్షంగా ఓటు వేయగా, తొమ్మిది మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. ఇద్దరు గైర్హాజరయ్యారు. కొత్తగూడెం డిపోలో 176 మంది ఓటర్లకు గాను 173 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇద్దరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయగా, ఒకరు గైర్హాజరయ్యారు. ఇల్లందు డిపోలో 106 మంది ఓటర్లకు గాను 102 మంది ఓటు వేశారు. ఇద్దరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయగా, మరో ఇద్దరు గైర్హాజరయ్యారు.భద్రాచలం డిపోలో 333 మంది ఓటర్లకు గాను 316 మంది ప్రత్యక్షంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. 11 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయగా, ఆరుగురు గైర్హాజరయ్యారు. మణుగూరు డిపోలో 240 మంది ఓటర్లకు గాను 226 మంది ప్రత్యక్షంగా ఓటు వేయగా, 12 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. ఇద్దరు గైర్హాజరయ్యారు.

**కూటమి గెలుపుపై ఉత్కంఠ**
ఖమ్మం రీజియన్‌లో ఐఎన్‌టీయూసీ మద్దతుతో సీఐటీయూ, ఎన్ఎంయూ కూటమి గెలుపు దిశగా ఉందని ప్రాథమిక సమాచారం మేరకు తెలుస్తోంది. అయితే తుది ఫలితాలు కౌంటింగ్ అనంతరం వెల్లడికానున్నాయి. దీంతో ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు, కార్మికుల్లో ఫలితాలపై ఆసక్తి నెలకొంది.

RNI NO. APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద కాన్షీరాం వర్ధంతి వేడుకలు

**- బహుజన రాజ్యాధికార సాధనకై పోరాడిన కాన్షీరాం జీవితం స్ఫూర్తిదాయకం**

**- బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి మేడి పవన్ దేవాన్ష్**

హైదరాబాద్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)



బహుజనుల రాజకీయ చైతన్యం, సామాజిక సమానత్వం, రాజ్యాధికార సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు మాన్యవర్ కాన్షీరాం ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి మేడి పవన్ దేవాన్ష్ అన్నారు. కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించిన నివాళుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ దేవాన్ష్ మాట్లాడుతూ, రాజకీయాల్లో ధనబలం ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు వేసే ప్రజలే పాలించే స్థాయికి ఎదగాలన్నది కాన్షీరాం రాజకీయ తత్వమని పేర్కొన్నారు. దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలకు జనాభా నిష్పత్తికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న లక్ష్యంతో ఆయన చేసిన పోరాటం చారిత్రాత్మకమని కొనియాడారు. కాన్షీరాం నాయకత్వంలో బహుజన రాజకీయాలకు బలమైన పునాది ఏర్పడిందని, మాయావతి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎదగడంలో ఆయన మార్గదర్శకత్వం కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాలకు రాజకీయ అధికారంలో సముచిత స్థానం కల్పించడమే కాన్షీరాం ఆశయమని తెలిపారు. విద్యార్థులు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు, సామాజిక న్యాయం సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేవ్ ఎడ్యుకేషన్ ఫోరం అధ్యక్షుడు వంగూరి సిద్ధార్థ, ఎస్టీఎస్ఏ అధ్యక్షుడు తాళ్ల అజయ్, బీవీఎం అధ్యక్షుడు వేదాంత్ మౌర్య, బహుజన విద్యార్థి నాయకుడు సందీప్ దళపతి తదితరులు పాల్గొని కాన్షీరాంకు ఘనంగా నివాళులర్పించారు.

# ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు లోకేష్‌ను ఆహ్వానించిన ఖమ్మం జిల్లా టీడీపీ నాయకులు

**- తల్లాడలో కార్యక్రమానికి రావాలని ఆహ్వానం**

**- నాయకులను అభినందించిన నారా లోకేష్**



తల్లాడ, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహావిష్కరణకు సన్నాహాలు చేస్తున్న ఖమ్మం జిల్లా టీడీపీ నాయకులను ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ అభినందించారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ పట్టణంలో త్వరలో నిర్వహించనున్న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానిస్తూ ఖమ్మం జిల్లా టీడీపీ నాయకులు శుక్రవారం మంగళగిరిలోని ఉండవల్లి నివాసంలో నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణ ఏర్పాట్లు, కార్యక్రమ వివరాలను ఆయనకు వివరించి ఆహ్వానించారు. నాయకులతో మాట్లాడిన నారా లోకేష్.. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నందుకు వారిని అభినందించారు. నాయకులు అందించిన ఆహ్వానంపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఎన్టీఆర్‌పై తమకున్న అభిమానానికి గుర్తుగా తల్లాడ పట్టణంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంటరీ టీడీపీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీ హడాక్ కమిటీ సభ్యుడు కేతినేని హరీష్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కన్నేటి పృథ్వీ, వద్దూరి బాబు, మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు ధూపాటి భద్రరాజు, మండల అధ్యక్షుడు సరికొండ శ్రీనివాస రాజు, మండల నాయకులు దుగ్గినేని వెంకటేశ్వర్లు, కొమ్మినేని సత్యనారాయణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ రెడ్డిని గెలిపించాలి

**- తల్లాడలో పట్టభద్రులకు అవగాహన కల్పించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి**

తల్లాడ, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ తల్లాడ మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తల్లాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పలు పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. నిరుద్యోగులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు, అనుభవం కలిగిన రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డికి మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దుండేటి వీరారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్, అన్నారుగూడెం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, నాయకులు కోడూరు రాము, యుగంధర్, బోడ నాగేశ్వరరావు, దామవరపు కన్నయ్య, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.



# ట్రేడ్స్‌మెన్ సమస్యలపై ఏఐటీయూసీ గర్జన

**- పదోన్నతుల్లో న్యాయం చేయాలి.. పనిముట్ల కొరత తీర్చాలి**

**- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొరిమి డిమాండ్**

కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి)

సింగరేణి కార్పొరేట్ ఏరియాలో ట్రేడ్స్‌మెన్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఫోర్‌మన్ అంతర్గత పరీక్షకు అర్హత కల్పించడంతోపాటు టెక్నీషియన్లకు అవసరమైన పనిముట్లను సమకూర్చాలని కోరారు. శుక్రవారం శేషగిరి భవన్‌లో నిర్వహించిన కార్పొరేట్ ఏరియా ట్రేడ్స్‌మెన్ సబ్‌కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు.

**పదోన్నతులకు అవకాశాలు కల్పించాలి**

టర్నర్లు, వెల్డర్లు, మిషినిస్టులకు ఫోర్‌మన్‌గా ఎదిగే అవకాశాలు కల్పించాలని నాయకులు కోరారు. ప్రస్తుతం యాక్టింగ్ ఫోర్‌మన్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగుల అనుభవం, సాంకేతిక నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకొని ఫోర్‌మన్ అంతర్గత పరీక్ష రాసేందుకు అర్హత కల్పించాలని డిమాండ్ చేశారు. బాధ్యతలు అప్పగిస్తూ పదోన్నతులకు అవసరమైన అవకాశాలు కల్పించకపోవడం ఉద్యోగుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు.



పనిముట్ల కొరత తీర్చాలి

కార్పొరేట్ సెంట్రల్ వర్క్‌షాప్, మెయిన్ వర్క్‌షాప్‌తోపాటు ఇతర విభాగాల్లో టెక్నీషియన్లు ఎదుర్కొంటున్న పనిముట్ల కొరతను వెంటనే పరిష్కరించాలని కోరారు. వాహనాలు, యంత్రాలు, పరికరాల నిర్వహణకు అవసరమైన టూల్స్ అందుబాటులో లేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పనిముట్ల కొరత ఉత్పత్తి, నిర్వహణ, భద్రతపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున యాజమాన్యం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు, యాజమాన్యంతో జరిగిన చర్చలు, సాధించిన ఒప్పందాలు, కార్మికులకు లభించిన ప్రయోజనాలను నాయకులు వివరించారు. కార్మికుల సమస్యలను సమావేశాలకే పరిమితం చేయకుండా సంఘటిత పోరాటాల ద్వారా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడమే ఏఐటీయూసీ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్మికులకు రావాల్సిన లాభాల



వాటాను దసరాలోపే ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**కార్పొరేట్ ట్రేడ్స్‌మెన్ సబ్‌కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**

సమావేశంలో కార్పొరేట్ ట్రేడ్స్‌మెన్ సబ్‌కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇన్‌చార్జిగారామును,అడ్వైజర్‌గా ఆనం దరెడ్డిని, కార్యదర్శిగా సి. హెచ్. మురళిని ఎంపిక చేశారు. సహాయ కార్యదర్శులుగా రాజశేఖర్, ప్రవీణ్, వేమనాచారిని, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సాయిరాజ్, రఘు, శ్రీధర్, మొ యినుద్దీన్, పృథ్వీని ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నర సింహ, రమణ, అశోక్, ఉమామహేశ్వరరావులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వం గ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శులు ఎస్.వి. రమణమూర్తి, జక్కుల గట్టయ్య, సముద్రాల సుధాకర్, ఉపాధ్యక్షుడు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి రాము, ఆఫీస్ బేరర్లు నాగయ్య, నితిన్, పిట్ కార్యదర్శులు నరేష్, సుధీర్, మధుకృష్ణ, కమల్, మల్లికార్జున్, రమేష్, నాయకులు పల్నాటి ప్రశాంత్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాల భారతి విద్యాలయంలో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

**- అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఆకట్టుకున్న విద్యార్థినుల ప్రదర్శనలు**





తల్లాడ, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):

తల్లాడ పట్టణంలోని బాల భారతి విద్యాలయంలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఒకే ప్రపంచం.. అనేక మంది బాలికలు.. ఒకే కల' అనే ఇతివృత్తంతో విద్యార్థినులు నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. భారత్‌తో పాటు జపాన్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తూ విద్యార్థినులు ఆయా ప్రాంతాల సంస్కృతులను ప్రతిబింబించే సంప్రదాయ దుస్తులు ధరించి వేదికపై ప్రదర్శనలు ఇచ్చారు. బాలికల హక్కులు, విద్యలో సమానత్వం, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, స్వేచ్ఛ, సృజనాత్మకత ప్రాధాన్యాన్ని తమ ప్రదర్శనల ద్వారా చాటిచెప్పారు. 'బతుకమ్మ పూలు వికసించినట్లే ప్రతి బాలికా వికసించాలి' అనే సందేశంతో ప్రతి బాలికకు విద్య, స్వేచ్ఛ, భద్రత, సమాన అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థినులు బతుకమ్మ చుట్టూ చేరి పాటలు, వేడుకలతో సందడి చేశారు. దేశాలు వేరైనా ప్రపంచమంతా ఒక్కటేనని, ప్రతి బాలిక ఉన్నతంగా ఎదగాలని ఐక్యత సందేశాన్ని అందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ బాలికల సాధికారత, ప్రపంచ ఐక్యత, సమానత్వం వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని బాల భారతి విద్యా సంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్లు కోటగిరి రాధా, కోటగిరి శ్రావణి, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తల్లాడలో ఘనంగా గ్యార్మీ వేడుకలు

**- పీర్ల ముజావర్ షేక్ యూసుఫ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ర్యాలీ**

**- మత సామరస్యం, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా పండుగ**





తల్లాడ, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)

ఆధ్యాత్మిక సందడి.. సంప్రదాయ ఆచారాలు.. భక్తిశ్రద్ధల నడుమ తల్లాడ పట్టణంలో గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీర్ల ముజావర్ షేక్ యూసుఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తరతరాలుగా వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయాలను కొనసాగిస్తూ నిర్వహించిన ర్యాలీ పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్యార్మీ పండుగలో భాగంగా నిర్వహించిన ర్యాలీ సంప్రదాయబద్ధంగా కొనసాగింది. పీర్ల ముజావర్ షేక్ యూసుఫ్‌తో పాటు మత పెద్ద మాలీ సాబ్, కమిటీ సభ్యులు షేక్ బడేమియా, షేక్ నన్నే సాబ్, షేక్ నాగుల సహకారంతో వేడుకలను నిర్వహించారు. ఆధ్యాత్మిక ఆచారాలకు ప్రాధాన్యమిస్తూ భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను కొనసాగించారు.

**మత సామరస్యానికి ప్రతీక**

గ్యార్మీ పండుగ మతపరమైన విశ్వాసాలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు సమాజంలో పరస్పర గౌరవం, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో మత పెద్దలు, నిర్వాహకుల పాత్ర కీలకమని ఈ వేడుకలు చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో షేక్ యాసిన్ పాషా (దాదా), మదారి జానీ, పటాన్ జానీ, షేక్ నాగుల్, మీరా, సోందు, రఫీ, అక్బర్‌తో పాటు పలువురు ప్రముఖులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. స్థానికుల సహకారం, మత పెద్దల సమన్వయంతో గ్యార్మీ వేడుకలుఘనంగా ముగిశాయి.

# గ్రావిటీ ప్రీమియర్ స్కూల్‌లో ఘనంగా దసరా- బతుకమ్మ సంబరాలు

**- సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం: కరస్పాండెంట్ బోడ పుణ్య నాయక్**

టేకులపల్లి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):

రంగురంగుల పూల బతుకమ్మలు.. విద్యార్థుల కేరింతలు.. ఆటపాటలు, సాంస్కృతిక నృత్యాల నడుమ గ్రావిటీ ప్రీమియర్ స్కూల్‌లో దసరా-బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ, విజయానికి ప్రతీకైన విజయదశమి పండుగలను పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో వేడుకలను ఉత్సాహంగా జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బోడ పుణ్య నాయక్ మాట్లాడుతూ, విద్యతో పాటు విద్యార్థులకు సంస్కారం, సంప్రదాయాల పట్ల గౌరవం నేర్పించడం కూడా ముఖ్యమని అన్నారు. పుస్తక జ్ఞానంతో పాటు మన సంస్కృతి మూలాలను పరిచయం చేయడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, ఐకమత్యం, సామాజిక బాధ్యత వంటి విలువలు పెంపొందుతాయని తెలిపారు. మన పండుగల విశిష్టతను చిన్నతనం నుంచే తెలుసుకోవడం ద్వారా భావితరాలు మన వారసత్వాన్ని గౌరవించి, పరిరక్షిస్తాయని పేర్కొన్నారు. "మన



సంస్కృతి మన అస్తిత్వం.. మన సంప్రదాయాలు మన వారసత్వం. వాటిని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత" అని అన్నారు. వేడుకలను విజయవంతం చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా గ్రావిటీ ప్రీమియర్ స్కూల్ కుటుంబం తరపున అందరికీ దసరా, బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు అన్నారుగూడెం ఫీడర్ పరిధిలో 2.30 గంటలు విద్యుత్ నిలిపివేత

తల్లాడ, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):



అన్నారుగూడెం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రాయల ప్రసాద్ తెలిపారు. అన్నారుగూడెం, లక్ష్మీనగర్, గోపాలపేట, నరసింహారావుపేట గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు. అవసరమైతే అంతరాయం ఉన్న మూడు ఫేజ్‌ల విద్యుత్ సరఫరాను ఉదయం గంట, సాయంత్రం గంటన్నర పాటు అందిస్తామని పేర్కొన్నారు.

# బొగ్గు టిప్పర్ డ్రైవర్ శీను కుటుంబానికి టీయూసీఐ ఆర్థిక సాయం

**రూ.26 వేల నగదుతో పాటు క్వింటాలున్నర బియ్యం అందజేత**



టేకులపల్లి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):

అనారోగ్యంతో మృతి చెందిన బొగ్గు టిప్పర్ డ్రైవర్ లాకావత్ శీను కుటుంబానికి మోటార్ వర్కర్స్ యూనియన్ టీయూసీఐ అండగా నిలిచింది. తోటి డ్రైవర్లు, ఇతరుల సహకారంతో రూ. 26 వేల నగదుతో పాటు క్వింటాలున్నర బియ్యాన్ని శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. యూనియన్ అనుబంధ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న, యూనియన్ నాయకుడు గుగులోతు మదర్ తదితరులు శీను చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఈ నెల 1వ తేదీన అనారోగ్యంతో శీను మృతి చెందాడని తెలిపారు. కొయ్యగూడెం ఓపెన్‌కాస్ట్ గని ప్రారంభమైనప్పటి నుంచి శీను సుదీర్ఘకాలం బొగ్గు టిప్పర్ డ్రైవర్‌గా పనిచేశాడని పేర్కొన్నారు. తోటి డ్రైవర్ల సహకారంతో యూనియన్ ద్వారా కుటుంబానికి అండగా నిలిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి మోటార్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి గుగులోతు మదర్‌తో పాటు చింటూ, రమేష్, రాము, చోటు, పవన్, మోకాళ్ల చంద్రశేఖర్, బుచ్చయ్య, నాగరాజు, అశోక్, వంశీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# డాన్ బాస్కో స్కూల్‌లో వైభవంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

తల్లాడ, అక్టోబర్ 09 (తెలంగాణ వాణి):

మండల పరిధిలో పినపాక గ్రామంలోని డాన్ బాస్కో స్కూల్ ఆవరణలో దసరా పండుగను పురస్కరించుకొని ముందస్తు బతుకమ్మ వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులలో ముస్తాబై, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అమర్చారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరుతు, చప్పట్లు కొడుతూ సాంప్రదాయ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతో పాటు మన సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేందుకే ఇటువంటి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినుల ఆటపాటలతో పాఠశాల ఆవరణలో కోలాహల వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా సాగిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శనివారం , అక్టోబర్ 10 , 2026

# సింగరేణి మెయిన్ హాస్పిటల్ రోడ్డు బాగు చేసేది ఎప్పుడు?

- ఎగుడుదిగుడుగా మారిన రహదారితో రాకపోకలకు ఇబ్బందులు
- ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరు?
- తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజల డిమాండ్



**కొత్తగూడెం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)**
సింగరేణి మెయిన్ హాస్పిటల్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు, రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై ఎగుడుదిగుళ్లు ఏర్పడటంతో రాకపోకలు ఇబ్బందికరంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రోగులు, ఉద్యోగులు, వాహనదారులు రాకపోకలు సాగించే ఈ మార్గాన్ని పట్టించుకునే వారే లేరా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

**రోగుల ప్రయాణానికి తప్పని తిప్పలు**
ఆసుపత్రికి వచ్చే రోగులను వాహనాల్లో తీసుకెళ్లే సమయంలో రహదారిపై ఉన్న గుంతలు, ఎగుడుదిగుళ్ల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం ఆసుపత్రికి చేరుకునే రోగులకు రహదారి పరిస్థితి మరింత సమస్యగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు సైతం రోడ్డుపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.

**ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది?**
ప్రజలకు వైద్య సేవలు అందించే ప్రధాన ఆసుపత్రికి వెళ్లే రహదారే సక్రమంగా లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రహదారి దుస్థితి కారణంగా ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సమస్య అధికారుల దృష్టికి వెళ్లలేదా? వెళ్లినా ఎందుకు పరిష్కరించడం లేదని నిలదీస్తున్నారు.

**తక్షణమే మరమ్మతులు చేపట్టాలి**
సంబంధిత అధికారులు, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి రహదారిని పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైన మరమ్మతులు చేపట్టి రోగులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



సింగరేణి యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి మెయిన్ హాస్పిటల్ రహదారికి మరమ్మతులు చేపడుతుందా? లేక ప్రజల ఇబ్బందులు ఇలాగే కొనసాగుతాయా? అనేది వేచి చూడాలి.

## ఆర్టీసీ వర్క్‌షాప్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐక్యకూటమి ఘన విజయం

- 12 ఏళ్ల తర్వాత భారీ మెజార్టీతో గెలుపు
- తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో సత్తా చాటిన కూటమి



**కరీంనగర్, అక్టోబర్ (తెలంగాణవాణి ప్రతినిధి)**
కరీంనగర్ ఆర్టీసీ వర్క్‌షాప్ జోనల్ పరిధిలో సుమారు 12 ఏళ్ల తర్వాత నిర్వహించిన ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐక్యకూటమి ఘన విజయం సాధించింది. టీఆర్ఎస్ ఐక్యకూటమితో హోరాహోరీగా సాగిన పోటీలో కాంగ్రెస్ కూటమి భారీ మెజార్టీతో గెలుపొందింది. ఆర్టీసీ వర్క్‌షాప్ జోనల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో యూనియన్ నాయకులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ఈ విజయాన్ని సాధించారు. ఆంజనేయులు, కాజా, ప్రవీణ్ కుమార్, సాయికుమార్, లవ్ కుమార్, వెంకట స్వామి తదితరులు ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించారు. దీర్ఘ విరామం తర్వాత లభించిన ఈ విజయం యూనియన్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపిందని నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులసమస్యలపరిష్కారం,వారిసంక్షేమంకోసంఐక్యంగా కృషిచేస్తామని పేర్కొన్నారు.

## రసులాబాద్ గ్రామంలో పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



**కొమురవెల్లి అక్టోబర్.9 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని రసూలాబాద్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొమురవెల్లి ఎంపీడీవో శ్రీనివాస వర్మ గ్రామ సర్పంచ్ పచ్చిమడ్ల అనూష స్వామి గౌడ్ ఉప సర్పంచ్ ఎర్రోళ్ల సుదర్శన్ మరియు మాజీ సర్పంచ్ స్వామి గౌడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుప్రియ రమేష్ పంచాయతీ కార్యదర్శి బాల్ నరసయ్య విద్యార్థిని విద్యార్థులు మహిళలు గ్రామస్తులు మానుపాడు మహిపాల్ ఎండి అబ్దుల్లా కుడిక్యాల సంతోష్ కుమార్ విష్ణు శ్రీకాంత్ కిరణ్ చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## బచ్చన్నపేటలో డ్రగ్ కంట్రోల్ టీమ్ ఆకస్మిక తనిఖీలు

పాఠశాల పరిసరాల్లోని పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు



**బచ్చన్నపేట, అక్టోబర్ 09 (తెలంగాణ వాణి)**
విద్యార్థులను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడంతో పాటు పాఠశాల పరిసరాల్లో నిషేధిత పదార్థాల విక్రయాలను అరికట్టే లక్ష్యంతో వరంగల్ డ్రగ్ కంట్రోల్ టీమ్ శుక్రవారం బచ్చన్నపేటలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. గౌరవనీయులైన సీపీ మేడమ్ ఆదేశాల మేరకు బచ్చన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బచ్చన్నపేట్గ్రామ ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఉన్న పాన్‌షాపులు, కిరాణా దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు.
ఈ తనిఖీల్లో శిక్షణ పొందిన డాగ్ స్క్వాడ్‌ను వినియోగించి గంజాయి, ఇతర మత్తు పదార్థాల కోసం పరిశీలించారు. పాఠశాల సమీపంలోని దుకాణాల్లో మత్తు పదార్థాల విక్రయాలపై నిఘా ఉంచడంలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల యజమానులకు అధికారులు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాలా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయించరాదని స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాల్లో ఇలాంటి పదార్థాల విక్రయాలకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దుకాణదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు, మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. పాఠశాల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టేందుకు దుకాణాల యజమానులు నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని తెలిపారు.

విద్యార్థుల భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పాఠశాలల పరిసరాల్లో ఇటువంటి తనిఖీలు నిర్వహించడం ద్వారా మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన పెంపొందించడంతో పాటు వాటి విక్రయాలను నిరోధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## వర్షాభావంపై అప్రమత్తం.. క్షేత్రస్థాయిలో చర్యలకు ఆదేశం

- కలెక్టర్లతో సీఎస్ సంజయ్ జాజు సమీక్ష
- అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా దిశానిర్దేశం





**కరీంనగర్, అక్టోబర్ 9 (తెలంగాణవాణి ప్రతినిధి)**
రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో కరువు పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండలాల వారీగా వర్షపాతం లోటు, పంటల పరిస్థితి, భూగర్భ జలాలు, తాగునీటి సరఫరా, విద్యుత్ అవసరాలపై సమీక్షించారు. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉండగా, 320 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.
వర్షాభావంతో వ్యవసాయ పనులు తగ్గే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టి కూలీలకు పని కల్పించాలని, చెరువుల్లో పూడికతీత, కాలువల మరమ్మతులు, ఫార్మ్ పాండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తాగునీటి కొరత ఏర్పడకుండా, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ నెల 12న ముఖ్యమంత్రి నిర్వహించనున్న సమీక్షకు సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.
అనంతరం కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా జిల్లా అధికారులతో సమీక్షించి, తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జలసిరి కార్యక్రమం కింద నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టి, ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు.

## మెదక్ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ ఘన విజయం

- పటాకులు కాల్చి సంబరాలు



**మెదక్, అక్టోబర్ 9 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో మెదక్ డిపో పరిధిలో ఎంప్లాయిస్ యూనియన్ ఘన విజయం సాధించింది. ఈ విజయంతో కార్మికుల సంబరాలు అంబరాన్నంటాయి. ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. కిష్టయ్య, నాయకులు డిపో సెక్రటరీగాసర్వన్, డిపో ప్రెసిడెంట్ గానరేందర్ ల ఆధ్వర్యంలో కార్మికులు పటాకులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ విజయం కార్మికుల విజయమని, కార్మికుల సంక్షేమమే తమ ధ్యేయమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## ప్రాథమిక విద్యతోనే ఉజ్వల భవిష్యత్తుకు పునాది

విద్యార్థుల్లో నైపుణ్యాల వికాసానికి 'తొలిమెట్టు' దోహదం
లోటస్ నేషనల్ స్కూల్‌లో ఘనంగా ఎఫ్‌ఎల్‌ఎన్ 'చెక్‌పాయింట్-1' వేడుకలు





**నాగారం అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):**
ప్రాథమిక విద్యలోనే పిల్లలకు బలమైన పునాది పడితే భవిష్యత్తులో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉంటుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ వార్డు మెంబర్ సీహెచ్. సాయినాథ్ గౌడ్ అన్నారు. నాగారం డివిజన్-5 పరిధిలోని లోటస్ నేషనల్ స్కూల్‌లో శుక్రవారం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్--తొలిమెట్టు) 'చెక్‌పాయింట్-1' వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాయినాథ్ గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే పునాది అని, చిన్నతనం నుంచే చదవడం, రాయడం, గణితంపై పట్టు సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా బోధన అందించడం అభినందనీయమన్నారు. ఈ దిశగా కృషి చేస్తున్న పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల చొరవను ప్రత్యేకంగా ప్రశంసించారు.

**విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై సమీక్ష**
పాఠశాల ప్రిన్సిపాల్ హేమలత మాట్లాడుతూ, ఎఫ్ఎల్ఎన్ 'చెక్ పాయింట్-1' కార్యక్రమం ద్వారా విద్యార్థుల చదవడం, రాయడం, సంఖ్యా పరిజ్ఞానానికి సంబంధించిన సామర్థ్యాలను సమగ్రంగా అంచనా వేసినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, వారి నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేక ప్రణాళికలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వివరించారు.
ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు
కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన విజ్ఞాన, సాంస్కృతిక కార్యక్రమాలు, వారి ప్రతిభను చాటిచెప్పే ప్రదర్శనలు హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఉత్సాహం, సృజనాత్మకతను చూసి అతిథులు, తల్లిదండ్రులు అభినందించారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలతో పాటు సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.
ఈ కార్యక్రమంలో ఎల్ఓఏ-1 ప్రసాద్, ఎల్ఓఏ-2 లీలావతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.

## సాయి ఎక్సలెంట్ పాఠశాలలో ముందస్తుబతుకమ్మ వేడుకలు

- సాంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థులు
- చిట్టి చేతుల్లో మురిసిన బతుకమ్మ



**జూలూరుపాడు, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)**
మండల కేంద్రంలోని జూలూరుపాడు సాయి ఎక్సలెంట్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలను పేర్చి బతుకమ్మలను అందంగా తీర్చి దిద్దిన చిట్టి చేతులు సాంప్రదాయ దుస్తులు ధరించి బతకమ్మ పాటలు పాడుతూ, సాంప్రదాయ నృత్యాలు చేస్తూ విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా సాయి ఎక్సలెంట్ పాఠశాల కరెస్పాండెంట్ ఆరెబోయిన కృష్ణ ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పరిచయం చేస్తూ మన పాఠశాల ప్రాంగణంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ ఆడుతూ పాడుతూ అలరిస్తూ సందడి చేయడం పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుందని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యతో పాటు ఆటలు, పాటలు, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలపై వివిధ రకాల యాక్టివిటీస్ చేయిస్తూ విద్యార్థులను మంచి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. గతంలో కూడా పాఠశాలలో ఎంతమంది కోచింగ్ తీసుకొని కాంపిటేటివ్ పరీక్షల్లో అర్హత సాధించి సీట్లు సాధించడం జరిగింది. అనంతరం విద్యార్థులు మరియు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది స్వీట్లు పంచుకొని బతుకమ్మ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి ఎక్సలెంట్ పాఠశాల డైరెక్టర్ ఆరెబోయిన నాగలక్ష్మి, ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఉపాధ్యాయులు నభీన, సత్యవతి, ఉదయభాను, భార్గవి, కళ్యాణి, అరుణ, స్వాతి, కృష్ణవేణి, శిరీష, రిచిత, యామిని, రజిత, జమున, మమత, సునీత, పల్లవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నకిరేకల్ నారాయణ హై స్కూల్ నందు ముందస్తు బతుకమ్మ సంబరాలు

సాంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థులు





**నకిరేకల్ : అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి గోవర్ధన్ )**
నకిరేకల్ మండల కేంద్రంలోని నారాయణ హై స్కూల్ నందు శుక్రవారం ఏర్పాటుచేసిన ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.
పూలను పేర్చి బతుకమ్మను అందంగా తీర్చిదిద్దిన చిట్టి చేతులు సాంప్రదాయ దుస్తులను ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలు చేస్తూ విద్యార్థులు అలరించి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ను పరిచయం చేస్తూ పాఠశాల ప్రాంగణంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నారులతో కలిసి బతుకమ్మ ఆడి ముందస్తు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శనివారం , అక్టోబర్ 10 , 2026

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష

## - కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి కోర్టు శిక్ష

**కొత్తగూడెం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):**
మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి కొత్తగూడెం స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రెండో తరగతి కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధించింది. కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో గుగులోత్ రమేష్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రవికుమార్ మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

**మద్యం సేవించి వాహనాలు నడపొద్దు**

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు భద్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు జి. ప్రవీణ్ కుమార్, టి. మోహన్, ఏఎస్ఐ రఫీ, కానిస్టేబుల్ జి. కృష్ణ, కోర్టు కానిస్టేబుల్ పాషా పాల్గొన్నారు.



# సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీ సిబ్బందికి ఘన సన్మానం



**చిలుకూరు అక్టోబర్ 9 (తెలంగాణ వాణి )**
చిలుకూరు మండల, జానకి నగర్ లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవా ప్రస్థానంలో 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా, చిలుకూరు మండలం జానకినగర్ గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. బీజేపీ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ సిబ్బంది సేవలు అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి భట్టు ఠాగూర్ నాయక్, జిల్లా నాయకులు బి. నాగేశ్వరరావు, బి. శ్రీకాంత్, బి. రాఘవేంద్రరావు, స్థానిక ఉపసర్పంచ్, విజయ బాలాజీ, సాయి కృష్ణ ప్రసాద్, రాజకుమార్, సాయి, సుబ్రమణ్యం, పండుతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.